క్లుప్తంగా

హద్దుల ఏర్పాటు



మల్హర్ : మండలంలోని కిషన్‌రావుపల్లి నుంచి భూపాలపల్లికి రోడ్డు కోసం అటవీ మార్గంలో బుధవారం హద్దులు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు ఫారెస్ట్ అధికారులు రోడ్డు నిర్మాణానికి హద్దులను ఎఫ్‌డీఓ అప్పల కొండయ్య నిర్ణయించారు. వారి వెంట భూపాలపల్లి రేంజ్ అధికారి నరేష్, రాజేశ్వరరావు, మల్హర్ మాజీ ఎంపీపీ చింతలపల్లి మలహర్‌రావు, అటవీశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత



గోవిందరావుపేట : మండలంలోని ఎల్‌బీనగర్ గ్రామానికి చెందిన బొగ్గుల రవి మూడు నెలల క్రితం గోవిందరావుపేట సమీపంలో ఫోన్ పోగొట్టుకున్నాడు. వెంటనే పస్రా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై కమలాకర్ సీఈఐఆర్ పోర్టల్ ఆపరేటర్ రతన్ సింగ్ సాయంతో పోగొట్టుకున్న ఫోన్‌ను కనిపెట్టి రికవరీ చేసి బుధవారం బాధితుడికి అందజేశారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే పోలీస్ స్టేషన్‌లో సంప్రదిస్తే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించవచ్చని ఎస్సై తెలిపారు.

'సర్వేలో అధికారుల నిర్లక్ష్యం'

వెంకటాపురం(కె) : మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షుడు యాసం రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అధికారులు అవకతవకలు చేశారని తెలిపారు. ఇప్పటికైన అధికారులు స్పందించి అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఇసాక్, కాంత, నాగమణి తదితరులు ఉన్నారు.

పశువులు తరలిస్తున్న వాహనం పట్టివేత

వెంకటాపురం(కె) : అక్రమంగా పశువులను తరలిస్తున్న డీసీఎంను పోలీసులు పట్టుకున్న సంఘటన బుధవారం జరిగింది. ఎస్సై రాజ్ కుమార్ తెలిపిన కథనం ప్రకారం.. ఏటూరు నాగారం చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కూరగాయల ట్రేలతో డీసీఎం వ్యాన్ కనిపించిందని తెలిపారు. వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో ఒడిశా రాష్ట్రం నవరంగపూర్ నుంచి అనుమతి లేకుండా 28 పశువులను తరలిస్తున్నారని వివరించారు. పశువలను తరలిస్తున్న వాహనంతో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన రమేశ్, ఒడిశాకు చెందిన హరికృష్ణ, హైదరాబాద్‌కు చెందిన రామకృష్ణలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వరండాలోనే విద్యాబోధన

65 మందికి మూడే గదులు
- అసంపూర్తిగా పాఠశాల గదుల నిర్మాణం
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



వరండాలోనే పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు



అసంపూర్తిగా తాగునీటి సంపు



నిర్మాణం పూర్తికాని పాఠశాల భవనం

చిట్యాల : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 65 మంది విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక ఉపాధ్యాయులు వరండాలోనే పాఠాలు బోధిస్తున్నారు. దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో మన ఊరు–మనబడి ద్వారా రెండు తరగతి గదులు మంజూరు చేశారు. అయితే వాటి నిర్మాణ పనులు చివరిదశకు చేరుకున్న కాంట్రాక్టర్‌కు నిధులు రాకపోవడంతో అక్కడి వరకే నిలిపి వేశారు. దీంతో తరగతి గదులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి.

పాలకులు పట్టించుకుంటేనే..

మండలంలోని జూకల్, చిట్యాలతో పాటు మరికొన్ని పాఠశాలలో మనఊరు–మనబడి ద్వారా అదనపు తరగతి గదులు, విద్యార్థులు భోజనం చేసేందుకు షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. కానీ ప్రభుత్వం మారడంతో నిధులు మంజూరు కాకవడంతో నిర్మాణ పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో కాంట్రాక్టర్లు తలలు పట్టుకునే దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నిర్మించిన భవనాలకు నిధులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అసంపూర్తిగా తాగునీటి సంపు..

మన ఊరు– మనబడిలో భాగంగా ప్రాథమిక పాఠశాలల అభివృద్ధి చెందాలని, విద్యార్థులకు తాగునీరు అందించేందుకు అప్పటి ప్రభుత్వం తాగునీటి సంపు నిర్మాణాలు చేపట్టింది. అయితే ఆ పనులు సైతం ఇప్పటి వరకు పూర్తి కాలేదు. దీంతో విద్యార్థులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఇప్పటికై న పాఠశాలలో నెలకొన్న పరిస్థితులను అధికారులు సందర్శించి మెరుగైన వసతులు కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

వసతుల కల్పనలో నిర్లక్ష్యం..

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యా అందించడం జరుగుతుందని ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి విద్యార్థులను పాఠశాలకు తీసుకవచ్చిన ఇక్కడ మాత్రం కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రైవేటు పాఠశాల కంటే ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల విద్యతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, దుస్తులు అందించి తరగతి గదులు లేకపోవడంతో వరండాలోనే పాఠాలు బోధించాల్సిన పరిస్థితి ఉంది. పాఠశాలకు మరిన్ని వసతులు కల్పిస్తే మరికొంత మంది విద్యార్థులు వచ్చే అవకాశం ఉందని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి పాటు పడుతున్నామని మాటల్లో చెబుతున్న అమలులో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు.

విద్యార్థులపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణ్‌బాబు

మల్హర్ : మండలంలోని కొయ్యూర్ ఎమ్మార్సీలో ఎంఈఓ లక్ష్మణ్ బాబు ఆధ్వర్యంలో బుధవారం మండల స్థాయి ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాల హెచ్‌ఎంలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రధానోపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులపై శ్రద్ధ వహించాలని ప్రతి విద్యార్థికి యూనిఫాం, పుస్తకాలు, నోట్ బుక్స్, నాణ్యమైన మధ్యాహ్న భోజనము అందించాలన్నారు. వర్షాకాలంలో పాఠశాలలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం టి.సుదర్శనం, సీహెచ్ తిరుపతి, పీజీ హెచ్‌ఎంలు నర్సింగరావు, తిరుపతి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ భవాని, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

లోడింగ్ చేయాలని లారీ డ్రైవర్ల ధర్నా



లారీ డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్సై పవన్‌కుమార్

కాళేశ్వరం : మహదేవపూర్ మండలంలోని ఇసుక క్వారీల వద్ద లోకల్ లారీలకు ముందుగా సీరియల్ ఇస్తుండడంతో విసిగెత్తిన ఇతర ప్రాంతాల లారీ డ్రైవర్లు రోడ్డెక్కి ధర్నా చేపట్టారు. బుధవారం మహదేవపూర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బెగుళూర్ ఇసుక క్వారీలో తమకు లోడింగ్ చేయకుండా లోకల్ లారీలకు ముందుగా సీరియల్ ఇచ్చారని, తామంతా వారం రోజులుగా లోడింగ్ కోసం ఉన్నామంటూ ఆందోళనకు దిగారు. దీంతో మహదేవపూర్ ఎస్సై పవన్‌కుమార్ చేరుకొని టీజీఎండీసీ పీఓ శ్రీకాంత్‌తో ఫోన్‌లో మాట్లాడి డ్రైవర్లకు నచ్చచెప్పి శాంతింపజేశారు. దీంతో అరగంట పాటు వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి. డ్రైవర్లను పోలీసుస్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ చేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

- పంచాయతీ రాజ్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

భూపాలపల్లి రూరల్: నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని రాష్ట్ర పంచాయతీ రాజ్ ఈఎన్సీ కార్యాలయంలో ఈఎన్సీ కనకరత్నం, ఎస్‌ఈ చక్రవర్తి, ఈఈ వెంకటేశ్వర్లు, పలువురు డీఈలు, ఏఈలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. భూపాలపల్లి నియోజకవర్గంలో పలు గ్రామాల్లో జరుగుతున్న రోడ్ల అభివృద్ధి పనులు, పెండింగ్ పనుల పురోగతి, త్వరలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. రంగాపురం–రేపాకపల్లి గ్రామాల మధ్య కొత్తగా హైలెవల్ వంతెన అవసరం ఉందని ఈఎన్సీకి సూచించారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారుచేయాలని ఈఈని కోరారు. గణపురం వెలుతుర్లపల్లి నుంచి గుర్రంపేట వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. భూపాలపల్లిలో డివిజన్ కార్యాలయంతోపాటు రేగొండలో సబ్ డివిజన్ కార్యాలయం మంజూరు చేయాలన్నారు.

కంకర రోడ్డు వేశారు



కంకరతో నిర్మించిన రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

రేగొండ : కొత్తపల్లిగోరి మండలంలోని జమ్‌షేడ్ బేగ్‌పేటలో నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద రోడ్డు బురదమయంగా మారి వాహనాలు అందులోనే దిగబడిపోతున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇదే విషయాన్ని 'బురదమయంగా రహదారి' శీర్షికన మంగళవారం సాక్షిలో కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. బురద మట్టిని తొలగించి కంకర పోసి రోడ్డు వేశారు.

గంజాయి ముఠా అరెస్ట్

- 3.135 కేజీల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేష్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: గంజాయి అక్రమ రవాణా, అమ్మకానికి పాల్పడుతున్న ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన వివరాలు వెల్లడించారు. భూపాలపల్లి పోలీస్, టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా తనిఖీ నిర్వహించి నలుగురు నిందితులను బాంబులగడ్డ శివారులో రియల్ ఎస్టేట్‌లో మంగళవారం పట్టుకోగా ఒకరు పరారైనట్లు తెలిపారు. భూపాలపల్లి పట్టణంలోని కృష్ణకాలనీ, కాశీంపల్లి గ్రామాలకు చెందిన దేవర కిషోర్, కీసర పవన్, తుటి విజయ్, సాయి ప్రకాశ్‌లను అరెస్ట్ చేయగా మోకిడి అజయ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుల వద్ద రూ.1.56 లక్షల విలువగల 3.135 కిలోల గంజాయి, 4 మొబైల్ ఫోన్లు, 2 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. విచారణలో నిందితులు ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి భూపాలపల్లి పరిసరాల్లో విక్రయించే ప్రయత్నం చేస్తున్నట్లు ఒప్పుకున్నారని తెలిపారు. దీంతో కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి, పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సమావేశంలో సీసీఎస్ సీఐ వెంకట్, ఎస్సైలు సాంబమూర్తి, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే ఇందిరమ్మ ఇళ్లు సాధ్యం'



భూమి పూజ చేస్తున్న సతీష్‌గౌడ్

టేకుమట్ల : కాంగ్రెస్‌తోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు సాధ్యమని ఆపార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని అంకుషాపూర్, ఆరెపల్లి, బండపల్లి, ఎంపేడు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారులతో కలిసి భూమి పూజ చేసి ముగ్గు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు పక్కా ఇళ్లను నిర్మించడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వం ఇంటికో డబుల్ బెడ్రూం ఇస్తామని మోసం చేసిందన్నారు. ప్రస్తుతం ప్రజా పాలనే లక్ష్యంగా ప్రతీ పేదకి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం ప్రభుత్వ ధ్యేయమన్నారు. లబ్ధిదారులు దళారుల మాటలు నమ్మొద్దన్నారు. ఆయన వెంట ఆయా గ్రామాల ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు ఉన్నారు.

మండల కమిటీ ఎన్నిక



టేకుమట్ల : బ్యాండు వాయిద్యా కళాకారుల మండల కమిటీని బుధవారం జిల్లా అధ్యక్షుడు ఓనపాకల కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పల్లెబోయిన సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆకినపల్లి మహేందర్, ఉపాధ్యక్షుడిగా సందాని, కార్యదర్శిగా సంగి నరేష్, సలహాదారుగా మైనోద్దీన్, కోశాధికారిగా బోయిని మధుకర్, గౌరవ అధ్యక్షుడిగా మదార్‌సాబ్, కార్యవర్గ సభ్యులుగా దుర్గాప్రసాద్, నర్సయ్య, రమేష్, సంపత్, దేవేందర్, ఐలయ్య, సారయ్య, కరుణాకర్, లింగయ్యను ఎన్నుకున్నారు. జిల్లా నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



టేకుమట్ల: నగదు అందజేస్తున్న మిత్రులు



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

టేకుమట్ల : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బొల్లు సరోత్తంరెడ్డి సోదరుడు శ్రీనివాస్ ఇటీవల పాముకాటుతో మృతి చెందగా బుధవారం బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. అనంతరం రూ.26వేల నగదును అందించారు. సట్ల రవి, ఎలవేని రాజేందర్, వంగ నరేష్, నిమ్మల స్వామి,సదానందం, ఆది రఘు, దావు రఘు,శ్రీధర్, కిరణ్‌రావు, వీరన్న, పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత

మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ అందె రాజమల్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుమారుడు అజయ్ బాల్య మిత్రులు బుధవారం రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించి భరోసా కల్పించారు. పెరుమాండ్ల రంజిత్, కట్ల పవన్, కేతిని లక్ష్మన్, ఉప్పుల శశి తదితరులు ఉన్నారు.

ముంపుపై ముందస్తు ప్రణాళిక



ముంపు ప్రదేశంలో ఏర్పాటు చేసిన ఎత్తైన విద్యుత్ స్తంభాలు



వరద నీటిలో మునిగిన విద్యుత్ స్తంభం(ఫైల్)

ఆయా పంచాయతీల సిబ్బందిని అప్రమత్తం చేసిన జిల్లా అధికారులు
- ముంపు ప్రదేశాల్లో ఎత్తైన విద్యుత్ స్తంభాల ఏర్పాటు
- వరదల్లోనూ నిరంతర విద్యుత్
- 30 గ్రామాలకు తప్పనున్న సమస్య



పేరూరు, కృష్ణాపురం మధ్య ముంపునకు గురైన బ్రిడ్జి (ఫైల్)

వాజేడు : వర్షాలు, వరదల ముంపుపై జిల్లా స్థాయి అధికారులు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. అలాగే మండల స్థాయి అధికారులతో పాటు గ్రామపంచాయతీల సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలుస్తోంది. వానాకాలం ప్రారంభం అయిన ఇంత వరకు భారీ వర్షం పడలేదు. అయితే ఏ క్షణంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉంటుందని, అందుకు జిల్లా నుంచి మండల, గ్రామ స్థాయి వరకు అధికారులను సిద్ధం చేసినట్లు సమాచారం. వర్షాలు భారీ స్థాయిలో కురిస్తే వరదలు వచ్చే అవకాశం ఉండటంతో గ్రామ స్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా అందుబాటులో ప్రజలకు చేరువగా ఉండాలను ఆదేశించారు. ఇప్పటికే మండల ప్రత్యేకాధికారులతో కూడా ముందస్తు ప్రణాళికలో భాగంగా సమావేశాలు నిర్వహించి సన్నద్ధం చేశారు. గతంలో వచ్చిన వరదల దృష్ట్యా అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నారు. వరదలు వస్తే ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు సకాలంలో పునరావాస కేంద్రాలకు తరలించడానికి సన్నద్ధంగా ఉండేలా అధికారులు సిద్ధమవుతున్నారు. ఏ సమయంలో గోదావరి వరదలు వచ్చినా, వర్షాలు భారీగా కురిసి వాగులు, వంకలు పొంగి ప్రమాద కరంగా మారినా అందుకు తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని ఇప్పటికే మండల స్థాయి అధికారులను జిల్లాస్థాయి అధికారులు ఆదేశించినట్లు సమాచారం.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు

గోదావరి ముంపు ప్రదేశాల్లో విద్యుత్ సిబ్బంది ఇప్పటికే ఎత్తైన విద్యుత్ స్తంభాలు వేశారు. ప్రతీ ఏటా గోదావరి ఉప్పొంగితే వాజేడు నుంచి చీకుపల్లి, గుమ్మడి దొడ్డి గ్రామాల మధ్య విద్యుత్ స్తంభాలు నీట మునిగి పోయేవి. దీంతో వాజేడుకు అవతలి వైపు ఉన్న 30 గ్రామాలకు వర్షాలు, వరదలు తగ్గే వరకు విద్యుత్ సరఫరా ఉండదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు నిత్యావసరాల పాటు తాగునీటి సమస్య, విద్యుత్ సరఫరా లేక చిమ్మ చీకట్లలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు విద్యుత్ శాఖాధికారులు ముంపు ప్రదేశాల్లో ఎత్తైన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. వాజేడు అవతల ఉన్న 30 గ్రామాలకు ఏ స్థాయిలో గోదావరి వరదలు వచ్చినా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండదు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



భూపాలపల్లి అర్బన్: అవగాహన కల్పిస్తున్న ఎస్సై సాంబమూర్తి



మొగుళ్లపల్లి : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అశోక్

భూపాలపల్లి అర్బన్ : సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో మోసాలకు పాల్పడుతున్నారని అప్రమత్తంగా ఉండాలని భూపాలపల్లి ఎస్సై సాంబమూర్తి తెలిపారు. సైబర్ జాగృతి దివస్ సందర్భంగా పట్టణంలో భూపాలపల్లి పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు పీఎం కిసాన్ యోజన, ఏపీకే ఫైల్ పంపడం ద్వారా డబ్బులు కొల్లగొడుతున్నారని వివరించారు. ఫేక్ డీపీల ద్వారా డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో డబ్బులు డిమాండ్ చేసి మోసగిస్తున్నారని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే హెల్ప్‌లైన్ 1930 నంబర్‌కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

మొగుళ్లపల్లి : మండలంలోని కోర్కిశాల మోడల్ స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలను విద్యార్థులకు వివరించారు. ఎవరికైనా సైబర్ నేరస్తులు కాల్ చేసి నమ్మొద్దని వెంటనే 1930 కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. బ్యాంకు డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు వివరాలు, ఓటీపీలు, రైతుబంధు, రైతు బీమా, రైతు భరోసా వంటి పథకాలకు సంబంధించిన సోషల్ మీడియాలో వచ్చే ఏపీకే యాప్స్ ఇన్‌స్టాల్ చేసుకోవద్దని సూచించారు. పోలీసులు, మోడల్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రికి సామగ్రి అందజేత



సామగ్రి అందజేస్తున్న యూత్ నాయకులు

రేగొండ : మండల కేంద్రంలోని ప్రైమరీ హెల్త్ సబ్ సెంటర్‌కి ఏక్సెల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకుడు కట్టంగూరి మనోహర్ రెడ్డి వాటర్ డిస్పెన్సర్, కుర్చీలు, టేబుల్, బెంచీలు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య, వైద్యానికి ఎలాంటి సహాయమైన అందజేస్తానని తెలిపారు. వైద్యాధికారి హిమబిందు, పంచాయతీ కార్యదర్శి తుల్జారాణి, యూత్ ఫౌండర్ కట్టంగూరి రాజేష్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు గుండాల శంకర్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.